సాక్షి
చిత్తూరు
బుధవారం । 20 । మార్చి । 2024



'స్వీప్'సెల్ఫీతో సందడి
యువ ఓటర్లను చైతన్య పరిచేందుకు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ వినూత్న రీతిలో అవగాహన కల్పిస్తోంది. - 8లో



ఎన్నికల్లో కీ రోల్ వీరిదే
జిల్లాలో ఎన్నికల వేడి మొదలైంది. ఎన్నికల ప్రక్రియలో అధికారులు, సిబ్బంది బిజీబిజీగా మారారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా)	సహర్ గురువారం (ఉ)
చిత్తూరు	6.29	4.56
పుంగనూరు	6.31	5.00

న్యూస్‌రీల్

హిందీ పరీక్షకు 634 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన పదో తరగతి హిందీ పబ్లిక్ పరీక్షకు 634 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 116 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. హిందీ పరీక్షకు 21,502 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 20,868 మంది హాజరైనట్లు చెప్పారు. సమస్యాత్మక కేంద్రాల్లో 13 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 10 ఫ్లెయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

గ్రీవెన్స్‌కు 80 దరఖాస్తులు



అర్జీల స్వీకరణలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో మంగళవారం ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. డీఎంఅండ్‌హెచ్ ప్రభావతీదేవి ఉద్యోగుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 80 అర్జీలు రాగా.. వీటిని రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ విజయ్‌బాబు పాల్గొన్నారు.

ఫారం బీ-12పై అవగాహన ముఖ్యం



అవగాహన ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల ఓటు హక్కుకు రూపొందించిన ఫారం బీ-12పై అవగాహన ముఖ్యమని స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ తులసి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ ట్రెనింగ్ సెంటర్‌లో విభిన్న ప్రతిభావంతులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఓటర్లుగా నమోదైన ప్రతి ఒక్క విభిన్న ప్రతిభావంతుడూ కచ్చితంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగులకు, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఓటు హక్కుకు ఎన్నికల సంఘం ఫారం బీ-12ని రూపొందించిందన్నారు. త్వరలో ప్రతి మండలంలో దీనిపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పీడబ్ల్యూడీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మురళి, జిల్లా అధ్యక్షులు చిన్నగుర్రప్ప పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఓటరు ఎపిక్ కార్డులు



పోస్టల్ శాఖకు పంపే కసరత్తులో సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఎన్నికల సంఘం పంపిణీ చేసిన 1,11,000 ఓటరు ఎపిక్ కార్డులు కలెక్టరేట్‌కు చేరాయి. ఈనెల 17న 81 వేలు, ఈనెల 18న 30 వేలు మొత్తం 1,11,000 ఓటరు ఎపిక్ కార్డులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. వచ్చిన కార్డులన్నింటినీ స్కాన్ చేసి మంగళవారం పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు పంపారు. పోస్టల్‌శాఖ నుంచి జిల్లాలోని సంబంధిత ఓటర్ల చిరునామాకు ఆ కార్డులు పోస్టు ద్వారా చేరనున్నాయి.

పోలింగ్ కేంద్రాలకు నిరంతర విద్యుత్



సమావేశంలో ఎస్‌ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు 24 గంటలు విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన చిత్తూరు రూరల్ ఈఈ కార్యాలయం నుంచి ఎనర్జీ కార్యదర్శి విజయానందం ఎస్‌ఈలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 3,718 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఏఈలు క్షేత్ర స్థాయిలో వాటిని పరిశీలించి పరిస్థితిని నివేదించాలని సూచించారు. పోలింగ్ రోజు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కూటమిలో కుంపటి!

- జిల్లాలో కుదరని సయోధ్య
- టీడీపీ, జనసేన, బీజేపీలో ఎవరికివారే
- మిత్రధర్మాన్ని నమ్మని టీడీపీ
- దూరమవుతున్న పలువురు సీనియర్లు
- ఒక ఎంపీ, 7 అసెంబ్లీ స్థానాల్లో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ



జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పొత్తు ధర్మాన్ని చిత్తు చేస్తున్నారు. గతంలో ఆయా పార్టీల్లో సీట్లు ఆశించి భంగపడ్డ నేతలు 'పొత్తు' కడుపులో కత్తులు నూరుతున్నారు. ప్రస్తుతం సీట్లు దక్కించుకున్న నేతలు కొందరు ఆ పార్టీ సీనియర్లనే అవమానించే రీతిలో నిఘా పెట్టడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. అందుకే దాదాపు అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రచారానికి డుమ్మా కొడుతున్నారు. మరికొందరు రహస్య సమావేశాలు పెట్టి కూటమిలో కుంపట్లు సృష్టించేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. అవకాశం కోసం ఎదురు చూస్తున్న ఇంకొందరు ఉమ్మడి అభ్యర్థులకు సహాయనిరాకరణ పాటిస్తూ దూరమవుతున్నారు. ఇదిలావుండగా.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏడు నియోజకవర్గాల్లోనూ ప్రచారపర్వాన్ని ముమ్మరం చేశారు. ఓటర్లకు దగ్గరవుతూ.. సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఆశీర్వదించాలని అభ్యర్థిస్తూ వడివడిగా అడుగులు ముందుకేస్తున్నారు.

- సాక్షి, చిత్తూరు

పూతలపట్టు.. కలిస్తే ఒట్టు!

పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షులు, ఆయా పంచాయతీలకు సంబంధించిన లీడర్లు మాత్రమే కనిపిస్తున్నారు. జనసేన నాయకులు అక్కడక్కడా నామమాత్రంగా పాల్గొంటున్నారు. బీజేపీ నేతలు వెదికినా ఎక్కడా కనిపించడం లేదు. గతంలో టీడీపీ అభ్యర్థిని వ్యతిరేకించిన ఐదు మండలాల్లోని టీడీపీ నేతలు ప్రచారానికి డుమ్మా కొడుతున్నారు. ఏళ్ల తరబడి టీడీపీ జెండా మోసిన తమకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవరిస్తున్నారని వారు రగిలిపోతున్నారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి వారిని బుజ్జగించే పనిలో నిమగ్నమైనట్టు సమాచారం.

నలువైపులా తిరిగేస్తున్న ఫ్యాన్

చిత్తూరు జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇప్పటికే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అధికారికంగానే ప్రకటించేశారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందరినీ సమన్వయం చేస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అధికార వైఎస్సార్‌సీపీకి చెందిన అభ్యర్థులందరూ పూర్తిస్థాయిలో ప్రచారంలో నిమగ్నమయ్యారు.

ఎంపీ అభ్యర్థిపై తేల్చని కూటమి

టీడీపీ అధినేత చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులో అభ్యర్థుల ఎంపిక తలబొప్పి కట్టేలా చేస్తోంది. సరైన అభ్యర్థులు దొరక్క వెతుకులాట ప్రారంభించాల్సి వస్తోంది. ఇందులో భాగంగానే చిత్తూరు పార్లమెంట్‌కు పోటీచేసే అభ్యర్థిని ఇంకా ఖరారు చేయలేదు. ఐఆర్‌ఎస్ అధికారి ప్రసాద్‌రావుతోపాటు ఒకరిద్దరి పేర్లు వినిపిస్తున్నా అధికారికంగా ప్రకటించ లేదు. దీంతో టీడీపీతోపాటు బీజేపీ, జనసేన కూటమి కలవరపడుతోంది.

చిత్తూరు టీడీపీ అభ్యర్థి స్పై పరేషాన్

చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్‌నాయుడు సీనియర్లను కాదని టికెట్టు దక్కించుకున్నారు. ఆయన తమ పార్టీ సీనియర్ నేతలపై స్పై ఆపరేషన్ కొనసాగిస్తున్నట్టు సాక్షాత్తు సీనియర్లే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను నమ్మకుండా నిఘా పెడతారా? అంటూ సీనియర్లు రుసరుసలాడుతున్నారు. ఇక బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి ఇప్పటివరకు ఎక్కడా ప్రచారంలో పాల్గొన లేదు. టీడీపీ అభ్యర్థి తమను ప్రచారానికి పిలవ లేదంటూ బీజేపీతోపాటు జనసేన నేతలు కినుకు వహించడం గమనార్హం. చిత్తూరు జనసేన టికెట్టుపై ఆశలు పెంచుకున్న డీకే ఆదికేశులు కుటుంబీకులతోపాటు మరికొందరు నేతలు టీడీపీ అభ్యర్థి ప్రచారంలో పాల్గొనేందుకు ఇష్టపడడం లేదు.

పలమనేరులో పారని మాజీ మంత్రి పావులు?

పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డి పావులు పారడం లేదు. ప్రచారంలో బీజేపీ, జనసేన సహకారం లేదని ఆయన మండిపడుతున్నట్టు సమాచారం. కొంతమేర చిన్నాచితక జనసేన నేతలు వస్తున్నప్పటికీ, బీజేపీ నేతలు మాత్రం ముఖం చాటేస్తున్నారు. కూటమి పొత్తు ధర్మాన్ని పాటించడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో మంత్రిగా పనిచేసిన సందర్భంలో ఆయన తమను కరివేపాకులా వాడుకున్నారని కొందరు జనసేన, బీజేపీ నేతలు గుర్తుచేసుకుని దూరమవుతున్నారు.

రగిలిపోతున్న కుప్పం జనసైనికులు

కుప్పంలో మూడు దశాబ్దాలుగా టీడీపీ క్యాడర్‌తో ఇమడలేక విసిగిన నేతలు, కార్యకర్తలు జనసేనలో చేరారు. ఎప్పటికైనా జనసేన తరఫున తమకు గుర్తింపు రాకపోతుందా అని ఎదురు చూశారు. రామేశ్వరం పోయినా శనేశ్వరం వదలదన్నట్టు పొత్తులో భాగంగా అదే టీడీపీతో ఇప్పుడు సఖ్యతగా ఉండాల్సి రావడంతో జనసేన నేతలు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. పైకి నవ్వుతూ కనిపిస్తూ.. లోలోన ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కూడా జనసేన కార్యకర్తలు టీడీపీకి దూరంగానే ఉంటున్నారు. ఇక బీజేపీ నాయకులు టీడీపీతో కలిసేందుకు ఏమాత్రం ఇష్టపడడం లేదు.

జీడీనెల్లూరులో కుదరని సయోధ్య

జీడీనెల్లూరు నియోవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో సయోధ్య కుదరడం లేదు. టీడీపీ అభ్యర్థి థామస్‌తో కలిసి మిత్రపక్షాలు ప్రచారం నిర్వహించడం లేదు. పాలసముద్రం, పెనుమూరు మండలాల్లో జనసేన నాయకులు ప్రచారంలో అంటీముట్టన్నట్టుగా ఉంటున్నారు. గతంలో జనసేన తరఫున టికెట్ ఆశించిన పొన్న యుగంధర్‌కి టీడీపీ అభ్యర్థి నుంచి పెద్ద మొత్తంలో సాయం అందడంతో ఆయన మెత్తబడినట్టు ఆ పార్టీ వర్గాలే గుసగుసలాడుతున్నాయి. జీడీ నెల్లూరులో దాదాపు అన్ని మండలాల్లో ఓట్ల కొనుగోలు కార్యక్రమాలపై టీడీపీ అభ్యర్థి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్టు సమాచారం.

నగరిలో ఒంటెద్దుపోకడ

నగరి నియోజకవర్గంలో కూటమి ప్రచారం ఏకపక్షంగా సాగుతోంది. స్థానికంగా ఉన్న జనసేన, బీజేపీ నేతలు టీడీపీ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలుస్తోంది. టీడీపీలో ఒక వెలుగు వెలిగిన అశోక్‌రాజు ఆ పార్టీ అభ్యర్థి భానుప్రకాష్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. ఆతర్వాత ఆయన ఇటీవల బీజేపీలో చేరారు. ఇప్పుడు ఆ రెండు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయి. దీంతో భానుప్రకాష్‌తో కలిసి ఎన్నికల ప్రచారానికి వెళ్లడానికి అశోక్‌రాజు ఇష్టపడడం లేదు. అందుకే ఆయన ప్రచారానికి, పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్టుగా ఉంటున్నట్టు ఆయన వర్గీలు చెబుతున్నారు.

పుంగనూరులో పత్తాలేని కూటమి

పుంగనూరులో టీడీపీ కూటమిలో ఎన్నికల జోష్ కనిపించడం లేదు. కనీస ప్రచారం కూడా నిర్వహించలేని స్థితిలో కూటమి కుమిలిపోతోంది. పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబుకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి వర్గం దూరంగా ఉంటోంది. మరోవైపు టీడీపీ నేతలు అనీషారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి కూడా ఎక్కడా ప్రచారంలో పాల్గొనడం లేదు. వీరి వర్గం చల్లా బాబుకు పనిచేసే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో చల్లా బాబు ఏకాకిగా మిగిలినట్టేనని ప్రచారం సాగుతోంది. ఆయన గత్యంతరం లేక మంత్రి పెద్దిరెడ్డి వ్యతిరేకవర్గమైన సీకే బాబును ఇటీవల చిత్తూరులో, అలాగే చంద్రగిరిలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారిని కలిసి మద్దతు కోరినట్టు ఆయన వర్గీయులు చెబుతున్నారు. ఇక గత ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసి ఓడిపోయిన రామచంద్రయాదవ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఢీకొట్టేందుకు బీసీవై పార్టీ ఆరంభించి చతికిలపడ్డారు. జనసేనకు ఇక్కడ చిన్న స్థాయి నాయకులు కూడా లేకపోవడం గమనార్హం.

మీ అభిమానం.. మరువలేం

- మోటారు సైకిల్ ర్యాలీలో మంత్రి పెద్దిరెడ్డి
- బుల్లెట్ నడిపి కార్యకర్తలను ఉత్సాహ పరిచిన వైనం
- 30 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలోనే చేశాం
- వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపు



పుంగనూరు మండలం ఏతూరులో మోటారు సైకిల్ ర్యాలీకి హాజరైన అభిమానులు

పుంగనూరు: 'మా కుటుంబంపై మీరు చూపిస్తున్న అభిమానాన్ని ఎప్పటికీ మరువలేం. ఎంతసేవ చేసినా మీ రుణం తీర్చుకోలేం' అని రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ మోటారు సైకిల్ ర్యాలీ నాల్గో రోజు మండలంలోని ఏతూరు, పెంచుపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ర్యాలీలో మంత్రి పెద్దిరెడ్డి బుల్లెట్‌ను నడిపి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. తరువాత ప్రచార రథంపై ర్యాలీగా ప్రజలకు అభివాదం చేస్తూ.. ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. వేలాది మంది అభిమానులు వాహనాలకు పార్టీ జెండాలు కట్టి, కండువాలు ధరించి వైఎస్సార్‌సీపీ జిందాబాద్, జయహో జగనన్న అంటూ నినాదాలు మిన్నంటించారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి జిందాబాద్ అంటూ ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 2019 ఎన్నికల పాదయాత్రలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేల కోట్ల రూపాయలు పుంగనూరుకు విడుదల చేశారని తెలిపారు. గత 30 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలో చేసి చూపించామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి చేపట్టి ప్రస్తుత ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి నూతన ఒరవడికి శ్రీకారంచుట్టి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. ఆయనను గెలిపించుకోలేక పోతే సంక్షేమం ఆగిపోతుందన్నారు. చంద్రబాబు పొత్తులతో శాంతి భద్రతలకు భంగం కలుగుతుందని, మతోన్మాదం చెలరేగుతుందని తెలిపారు. ఇలాంటి పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో రెండో సారి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ప్రచార కర్తలుగా, వైఎస్సార్‌సీపీ స్టార్ క్యాంపియన్లుగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు తమ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ర్యాలీలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి యాదవ్, ఆర్టీసి మజ్దూర్ అధ్యక్షుడు జయరామిరెడ్డితో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



పుంగనూరులో బుల్లెట్ నడుపుతున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం: ఊటుపల్లెకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు(కాంగ్రెస్), టీడీపీ నాయకుడు ఎర్రంరెడ్డి, పుట్టావారిపల్లెకు చెందిన నాగరాజ తమ అనుచరులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాను కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు స్వరూప, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, మురళీమోహన్, అన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. సైనికుల్లా పనిచేస్తాం

- ముందుకొచ్చిన యువత, మహిళలు
- పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి ఆర్కే రోజా



పార్టీలో చేరిన వారితో మంత్రి ఆర్కే రోజా

నగరి : 'నగరి నియోజకవర్గ ప్రమాణాలు పెంచారు. ఇప్పటి వరకు ఎవరూ చేయని అభివృద్ధి పనులు చేపట్టారు. ఇది మాకు గర్వకారణం. మీకు అండగా ఉంటాం. ఎన్నికల్లో సైనికుల్లా పనిచేస్తాం' అంటూ నగరి దళితవాడకు చెందిన పలువురు యువకులు, మహిళలు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయానికి విచ్చేసిన అముదామోహన్, విల్సన్, దయానిధి, చార్లెస్, గోపాల్, ఆనంద్‌రాజ్, గ్లోరీ, కస్తూరి, మీనా, భారతి, వల్లి, ప్రతాప్‌తో పాటు 150 మంది మంత్రి ఆర్కే రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ నగరి రూపురేఖలు మారిపోయాయన్నారు. గతంలో డీఎస్పీ, ఆర్డీవో, ఆర్టీవో కార్యాలయాలకు చిత్తూరుకు వెళ్లాల్సి ఉండేదన్నారు. అలాగే డయాలసిస్ చేసుకోవాలంటే తిరుపతి, శ్రీకాళహస్తి, చెన్నై వెళ్లాల్సి వచ్చేదని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు పార్కులు కూడా లేవని, నేడు నగరిలోనే పార్కు ఉందని సంతోషం వ్యక్తం చేశారు. నగరికి ల్యాండ్ మార్కు అయిన టవర్ క్లాక్ పనిచేసేలా మంత్రి ఆర్కే రోజా కొత్తకళ తెచ్చారని కొనియాడారు. ఏరియా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంటును ఏర్పాటు చేసిన ఘనత మంత్రికే దక్కుతుందన్నారు. చివరకు శ్మశాన వాటికలో కూడా ఎల్‌పీజీ క్రిమేషన్ షెడ్డు ఏర్పాటు చేశారని చెప్పారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందరికీ అందించారని తెలిపారు. ఇంతకన్నా మంచి చేసే నాయకులు ఎవరుంటారని ప్రశ్నించారు. అందుకే ఆమెకు అండగా ఉండేందుకు నిర్ణయించినట్టు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగరి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ పరీక్షల తనిఖీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఓపెన్ స్కూల్ పరీక్షలను రాష్ట్ర అబ్జర్వర్‌లు మంగళవారం పర్యవేక్షించారు. జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర అబ్జర్వర్‌లు అక్బర్‌అలీ, శ్రీనివాసులు జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని 21 పరీక్ష కేంద్రాలలో రెండో రోజు పది, ఇంటర్ పరీక్షలు జరిగాయి. పదో తరగతి పరీక్షకు 54 మందికి గాను 50 మంది హాజరుకాగా నలుగురు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షకు 2,682 మందికి గాను 2,590 మంది హాజరవ్వగా 92 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పకడ్బందీగా ఎన్నికల విధులు



మాట్లాడుతున్న ఆర్డీఓ మనోజ్‌రెడ్డి

పలమనేరు: ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఆఫ్ కాండెక్ట్‌ను పటిష్టంగా అమలు చేస్తున్నామని పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి తెలిపారు. ఆమేరకు స్థానిక కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ఎలాంటి ఫిర్యాదులు అందినా, వాటిపై ఎప్పటికప్పుడు విచారించి చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. పదో తరగతి విద్యార్థుల రైటింగ్ ప్యాడ్లపై ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫొటోలున్న విషయంపై అందిన ఫిర్యాదు మేరకు ఆ ప్యాడ్లు లేకుండా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. అదేవిధంగా సోషల్ మీడియాలో అనవసర విషయాలను పోస్ట్ చేసేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎస్పీ మహేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ రంగనాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కీ రోల్ వీరిదే!

- జిల్లాలో మొదలైన ఎన్నికల వేడి
- అధికారులు బిజీబిజీ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఎన్నికల వేడి మొదలైపోయింది. ఇప్పటికే అధికారులు ఎన్నికల పనుల్లో బిజీబిజీ అయ్యారు. ఈ ఎన్నికల నిర్వహణలో జిల్లా ఎన్నికల అధికారి నుంచి పోలింగ్ స్థాయి అధికారి (బీఎల్‌ఓ) వరకు అందరూ కీలకమే. నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతి విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిందే. ఎన్నికల కసరత్తులో అధికారుల బాధ్యతలు.. విధుల గురించి ఓ లుక్కేద్దాం.

జిల్లా ఎన్నికల అధికారి

జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జిల్లా ప్రధాన ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరిపించడంలో కీలక పాత్ర పోషిస్తారు.

రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)

శాసనసభ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి నియోజకవర్గానికీ ఒక రిటర్నింగ్ అధికారిని నియమించింది. వీరు నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, అభ్యర్థుల తుది జాబితా తదితర విషయాల్లో నిమగ్నమవుతారు. పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది నియామకాలు, వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వంటి విధులను ఆర్వోలు నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏడుగురు ఆర్వోలు, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆర్వోగా వ్యవహరిస్తారు.

ఏఆర్వో

నియోజకవర్గ స్థాయిలో ఆర్వోలకు సహాయకాధికారిగా స్థానిక తహసీల్దార్లు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు. ఆర్వో చేపట్టే బాధ్యతలను వీరు సమన్వయంతో నిర్వహిస్తారు. ఆర్వోకి అన్ని విధాలా సహాయం చేస్తూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తారు.



సూచనలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ (ఫైల్)

ప్రిసైడింగ్ అధికారి

ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆయన పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తారు. పోలింగ్ అనంతరం సీల్ వేసి స్ట్రాంగ్‌రూంకు తరలిస్తారు. ఇతనికి మరో అధికారి ఏపీఓ ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే అన్ని కార్యకలాపాలు ఈయన పర్యవేక్షణలోనే జరుగుతాయి.

సెక్టోరల్ అధికారి

ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించేందుకు ఒక్కో సెక్టోరల్ అధికారిని నియమిస్తారు. మండలంలో వివిధ శాఖల్లో పనిచేసే గెజిటెడ్ అధికారులు ఈ బాధ్యతలు చూసుకుంటారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చోట 144 సెక్షన్ విధించే అధికారం సెక్టోరల్ అధికారికి ఉంటుంది. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాల చేపట్టాల్సిన బందోబస్తును సిఫారసు చేయడం వంటి విధులు నిర్వహిస్తారు.

> **బాధ్యతగా విధులు నిర్వర్తించాలి**
>
> 
>
> జిల్లాలో ఎన్నికల కసరత్తు చాలా ముఖ్యమైంది. ఎన్నికలకు నియమించిన ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలి. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించకూడదు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల సంఘం పరిధిలో ప్రతి అధికారి పనిచేయాలి. ఎన్నికల సంఘం సూచించిన విధులను తూచాతప్పకుండా పాటించాలి.
>
> – షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

జిల్లా సమాచారం	
పోలింగ్ కేంద్రాలు	1,771
జిల్లా ఎన్నికల అధికారి	01
రిటర్నింగ్ అధికారులు	07
అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు	33
ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు	21
బీఎల్‌ఓలు	1,771

ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు

నియోజకవర్గానికి ఒకటి లేదా రెండు చొప్పున ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఉంటాయి. ఆ బృందాలు ఆయా మండలాల్లో మద్యం, డబ్బు, ఓటర్లను ప్రలోభ పరిచేందుకు తరలించే సామగ్రి అక్రమ రవాణా జరగకుండా విస్తృతంగా తనిఖీలు చేపడుతారు.

మైక్రో అబ్జర్వర్లు

ఎన్నికలు జరిగే తీరును నివేదికగా రూపొందించి జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపడంలో మైక్రో అబ్జర్వర్లు కీలకంగా వ్యవహరిస్తారు.

బీఎల్‌ఓలు

కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి దరఖాస్తులను అందజేయడం, ఓటర్లను తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడడం బీఎల్‌ఓల బాధ్యత. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల గురించి ఉన్నతాధికారులకు తెలియజేయడం, ఓటరు జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల మార్పు తదితర సేవలను అందిస్తారు.

ఓటరు నమోదు అధికారి

ఓటర్ల జాబితాను తయారు చేయడం ఈ అధికారి బాధ్యత. ఓటు నమోదు చేసుకొనే వారు, జాబితాలో పేర్లు తప్పుగా ఉన్న వారు ఈ అధికారిని సంప్రదిస్తే తగిన చర్యలు తీసుకుంటారు. వీరి పర్యవేక్షణలో కొందరు సిబ్బంది పనిచేస్తారు.

కుప్పం నుంచి బాబును సాగనంపండి



ఇంటింటా ప్రచారంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

- ఎన్నికల ప్రచారంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపు

గుడుపల్లె: ఈ ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గం నుంచి చంద్రబాబును ఓడించి ఇంటికి సాగనంపాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే భరత్ ఓటర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రమైన గుడుపల్లెలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 35 ఏళ్ల ఎమ్మెల్యేగా, 14 ఏళ్ల ఎంసీగా ఉన్న చంద్రబాబునాయుడు ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకం ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. 'నేను కుప్పాన్ని సింగపూర్ చేస్తా.. నేనే సెల్ ఫోన్ కనిపెట్టా'నంటూ గారడీ మాటలు చెప్పి పారిపోతున్నారన్నారు. ఇన్నేళ్లు మనందరినీ మోసం చేసి ఓట్లు దండుకుని బురిడీ కొట్టిస్తున్నారని మండిపడ్డారు. పేదలకు ఒక్క మేలైనా చేశారా..? అని నిలదీశారు. కుప్పం నియోజకవర్గంలో ఏ ఒక్కరినీ రాజకీయంగా, ఆర్థికంగా ఎదగనివ్వలేదని ధ్వజమెత్తారు. జెండాలు మోసిన నాయకులను పక్కన పెట్టి బయట ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఇన్‌చార్జ్‌లుగా నియమించి కుప్పం వాసులను దొంగలుగా గుర్తించారని చెప్పారు. ఇక్కడి ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఎన్నికల సమయంలో కూడా కుప్పంకు రాకుండానే గెలుపొందుతున్నారని చెప్పారు. టెక్నాలజీ పెరిగే కొద్దీ ప్రజలు కూడా మారుతారన్న విషయాన్ని చంద్రబాబు గుర్తించాలని సూచించారు. కులం, మతం, వర్గం చూడకుండా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామని, ఈ సారి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే.భరత్‌ను, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంటింటా తిరిగి సంక్షేమ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, కన్వీనర్ రామక్రిష్ణ, కో–కన్వీనర్ హరినాథ్, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు రూరల్: ప్రసవ సేవల్లో నిర్లక్ష్యం వద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతీదేవి సిబ్బందిని హెచ్చరించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కోడ్‌కు దూరంగా ఉండాలని, కోడ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. వైద్యసేవల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, 108 సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసు సిబ్బంది

గుడుపల్లె: అక్రమంగా తమిళనాడుకు తరలుతున్న కర్ణాటక మద్యాన్ని కారుతో సహా స్వాధీనం చేసుకున్నట్టు కుప్పం డీఎస్పీ శ్రీనాథ్, సీఐ ఈవ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ లక్ష్మీకాంత్ తెలిపారు. వారి కథనం.. కర్ణాటక సరిహద్దులోని బిసానత్తం చెక్‌పోస్టు వద్ద ఎన్నికల విధుల్లో ఇన్‌చార్జ్ అబ్దుల్ రహీం, ఆర్‌ఐ సత్తార్ ఉండగా.. అదే సమయంలో వేగంగా కారు వచ్చి ఆగింది. ఆపై డ్రైవర్, మరో ఇద్దరు కారు దిగి పారిపోవడంతో అనుమానం వచ్చి కారులో పరిశీలించారు. అందులో త్రిబుల్ ఎక్స్‌రమ్ 15 కేసులు, బెంగళూరు రమ్ 20 కేసులు ఉన్నాయి. వీటి విలువ రూ.లక్ష పైనే ఉంటుంది. ఈ మేరకు మద్యంతోపాటు కారును స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వ్యక్తులను కుప్పం రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడులోని తిరుపత్తూర్‌కు చెందిన కార్తీక్, మురళి, వెంకటేష్‌గా గుర్తించారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు.

నూతన కార్యవర్గం ఎంపిక



నియామాక పత్రం అందుకుంటున్న ప్రధాన కార్యదర్శి, యువజన అధ్యక్షులు

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జయగణేష్, జిల్లా యువజన అధ్యక్షులుగా వినోద్‌గౌడ్‌ను ఆ సంఘ ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. మంగళవారం సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, జిల్లా అధ్యక్షులు జ్ఞానజగదీష్ అధ్యక్షతన వారికి నియామక పత్రాలు అందజేశారు.

'స్వీప్' సెల్ఫీలతో సందడి

చిత్తూరు అర్బన్: యువ ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్ పోగ్రామ్ (స్వీప్)లో భాగంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా హాలీవుడ్ యానిమేటెడ్, సూపర్ హీరోలు థోర్, అన్నా ఫ్రొజెన్ ముఖ చిత్రాలతో ఉన్న సెల్ఫీ కటౌట్లను నగరంలోని పలు కళాశాలల్లో మంగళవారం ఏర్పాటు చేశారు. సహాయ రిటర్నింగ్ అధికారి (ఏఆర్‌వో) అరుణ వీటిని ప్రత్యేకంగా తయారు చేయించి, రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కృషిచేస్తున్నారు. పలు కళాశాలల వద్ద ఏర్పాటు చేసిన స్వీప్ సెల్ఫీ చిత్రాల వద్ద యువత సెల్ఫీలతో ఉత్సాహంగా కనిపించారు. ఎన్నికల్లో తప్పకుండా ఓటు హక్కు ఉపయోగించుకుంటామని యువత చేత అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానంగా కొత్తగా ఓటు హక్కు పొందిన ప్రతీ ఒక్కరూ.. ఓటు విలువను గుర్తించుకోవాలని కమిషనర్ సూచించారు.



స్వీప్ సెల్ఫీ వద్ద యువతుల ఉత్సాహం

రూ.4 లక్షల నగదు స్వాధీనం

కుప్పం రూరల్: ఆంధ్ర – కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన రాజుపేట రోడ్డు నుంచి ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్న రూ.4 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం.. మంగళవారం మండలంలోని రాజుపేట వద్ద ఎన్నికల అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, బగళనత్తం గ్రామానికి చెందిన ప్రభాకర్ ద్విచక్ర వాహనంలో రికార్డులు సక్రమంగా లేకుండా నాలుగు లక్షల రూపాయల నగదును తీసుకెళ్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును ఖజానాకు తరలించినట్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లరాదని పేర్కొన్నారు.

నలభై ఏళ్ల రాజకీయ అనుభవమంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబు.. ఏరు దాటాక తెప్ప తగలెట్టడం.. నమ్మించి వంచించడం ఆయన నైజం. అధికారం కోసం ఎవరితో అయినా జట్టు కడతారు. పొత్తుల పేరుతో కూటములు ఏర్పాటు చేస్తారు. తీరా సీట్ల పంపకానికి వచ్చే సరికి నిజ స్వరూపం బయటకు తీస్తారు. దశాబ్దాలుగా తాను పాటించే నయవంచన సిద్ధాంతాన్నే ఆయన పునరావృతం చేశారు. పేరుకు మాత్రం తిరుపతి అసెంబ్లీ టికెట్‌ను జనసేనకు కేటాయించారు. వెంటనే టీడీపీ నేతలను రెచ్చగొట్టి అసమ్మతి రాగం వినిపించారు. ఇందుకోసం నాయకుల మధ్య నిర్మొహమాటంగా విభేదాలను సృష్టించారు. గ్లాస్ గుర్తు అభ్యర్థి నాన్ లోకల్ అంటూ సరికొత్త వివాదాన్ని తెర మీదకు తెప్పించారు. ఇదే కోవలోనే సత్యవేడులో సైతం ఆదిమూలానికి టికెట్ ప్రకటించారు. వెనుక నుంచి తమ్ముళ్లను నిరసనలకు దింపేశారు. తాను అనుకున్నది నెరవేర్చుకోవడమే లక్ష్యంగా నైతిక విలువలకు తిలోదకాలిచ్చేశారు.



పొత్తులు.. పన్నాగాలు!

- తిరుపతిలో జనసేనకు పొగబెడుతున్న బాబు
- టీడీపీ నేతలను ఉసిగొల్పి ఆందోళనలు
- సత్యవేడులో ఆదిమూలంపై తమ్ముళ్లను రెచ్చగొట్టిన అధినేత
- తిరుపతిలో రాజుకున్న లోకల్.. నాన్ లోకల్ వివాదం
- 'ఆరణి' అభ్యర్థిత్వంపై నిరసన

సాక్షి, తిరుపతి : రాష్ట్రంలోనే కీలకమైన తిరుపతి సీటును జనసేనకు కేటాయించడం ఇష్టం లేక చంద్రబాబు టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టేశారు. తిరుపతి అభ్యర్థిగా టీడీపీ నేతల్లోనే ఒకరిని జనసేనలోకి పంపి.. వారికే టికెట్ ఇప్పించుకునేందుకు బాబు పథకం రచించినట్లు ప్రచారం సాగుతోంది. పొత్తులో భాగంగా పవన్ కోరినట్టే తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించి తాను మాట మీద నిలబడతానని తొలుత అందరినీ నమ్మించారు. బాబు తీసుకున్న నిర్ణయానికి పవన్ కూడా ఆహా.. ఓహో అని కొనియాడారు. ఇంతలోనే తిరుపతి టికెట్ తిరిగి టీడీపీ నేతలకే కట్టబెట్టేందుకు చంద్రబాబు తమ వారిని ఉసిగొల్పారు. అందులో భాగంగానే తిరుపతిలో టీడీపీ నేతలు »లోకల్.. నాన్ లోకల్« అనే వాదనను తెరపైకి తెచ్చారు. పార్టీ నాయకులతో ఆందోళనలు చేయించేందుకు సిద్ధమయ్యారు. స్థానిక జనసేన నాయకులను కూడా కలుపుని రోడ్డుపైకి వచ్చి ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆరణి శ్రీనివాసులు కాకుండా తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా పనిచేస్తామని రెండు పార్టీల అధినేతలకు తెలిసేలా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో టీడీపీ నేతలతో పాటు జనసేన శ్రేణులు కలిసి పాల్గొనేలా బాబు స్కెచ్ రూపొందించినట్లు సమాచారం. చంద్రబాబు ఆదేశాల మేరకే టీడీపీ, జనసేన నేతలు తిరుపతిలో ప్రెస్ మీట్లు పెట్టి ఆరణి శ్రీనివాసుల అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడం.. ఎల్లో మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయిస్తున్నారు. తాజాగా మంగళవారం స్థానిక టీడీపీ నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తన అభ్యర్థిత్వంపై అధిష్టానం పునరాలోచించుకోవాలని కోరారు. తనకే టికెట్ ఇప్పిస్తామని భరోసా ఇస్తే జనసేనలో అయినా చేసేందుకు సిద్ధమని ఇరు పార్టీల అధినేతలకు స్పష్టంగా సందేశం పంపించారు. అయితే ఎక్కడా పార్టీ ఆదేశాలను ధిక్కరించబోమని సన్నాయి నొక్కులు నొక్కడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఆరణి శ్రీనివాసులు తిరుపతిలో నివాసం కొనుగోలు చేసి మంగళవారం గృహ ప్రవేశం కూడా చేశారు. పార్టీ కార్యాలయం కూడా అందులోనేనని ప్రకటించారు. ఇకపై తిరుపతిలోనే ఉంటానని చెప్పుకొచ్చారు.

> **శ్రీకాళహస్తి కోసం 'కోలా' పట్టు**
>
> పొత్తులో భాగంగా శ్రీకాళహస్తి అసెంబ్లీ సీటును బీజేపీకి కేటాయిస్తారని, అదే జరిగితే తానే అభ్యర్థి అని కోలా ఆనంద్ ఆశగా ఎదురుచూశారు. తన అనుచరులతో ప్రచారం కూడా ప్రారంభించారు. చివరకు బొజ్జల సుధీర్‌రెడ్డి పేరును ప్రకటించడంతో కోలా ఆనంద్ ఖంగుతిన్నారు. పొత్తు పొడిచినప్పటి నుంచి కోలా ఆనంద్ ఢిల్లీలోనే ఉన్నారు. తనకు టికెట్ ఖరారయ్యేంత వర కు ఢిల్లీ వదిలేదని భీష్మించుకున్నట్లు శ్రీకాళహస్తిలో ప్రచారం సాగుతోంది. నోటిఫికేషన్ లోపు కోలా ఆనంద్ అభ్యర్థిగా ప్రకటించుకుని వస్తారని కమలం పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

> **జనసేనలో అసమ్మతి రాగం**
>
> ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వంపై జనసేనలోనూ అసమ్మతి రాగం మొదలైంది. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ ఇంట్లో మంగళవారం నగరంలోని 50 డివిజన్‌ల జనసేన అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఆరణికి సహకరించేది లేదని తీర్మానం చేశారు. డివిజన్ అధ్యక్షులను మార్పులు, చేర్పులు చేస్తున్న ఆరణి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు తెరమీదకు తెచ్చినట్లు నాన్ లోకల్ వద్దు.. లోకల్ అభ్యర్థే ముద్దు అంటూ వెల్లడించారు. పవన్ కల్యాణ్ వద్దే ఈ విషయం తేల్చుకుంటామని కిరణ్ రాయల్ స్పష్టం చేసినట్లు తెలిసింది.

> **ఆదిమూలానికి తప్పని సెగ**
>
> వైఎస్సార్‌సీపీపై బురద జల్లేందుకు ఆదిమూలాన్ని చంద్రబాబు పావుగా వాడుకున్నారు. చివరకు ఆదిమూలానికి టికెట్ ఇవ్వకపోతే.. జనంలో చులకనవుతామని భావించారు. చెప్పినట్టే ఆదిమూలాన్ని సత్యవేడు టీడీపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆ తర్వాతే అసలు కుట్రలకు తెరతీశారు. అందులో భాగంగా స్థానిక టీడీపీ నేతలను రెచ్చగొట్టి ఆదిమూలానికి వ్యతిరేకంగా ఆందోళనలు, ధర్నాలు చేయాలని సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన ఆదేశాల మేరకే సత్యవేడులో కొద్ది రోజులుగా టీడీపీ శ్రేణులు వరుసగా ధర్నాలు, ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆందోళనలు తారస్థాయికి చేరడంతో చంద్రబాబు మంగళవారం మాజీ ఎమ్మెల్యే హేమలత, ఆమె కుమార్తె డాక్టర్ హెలెన్‌ని అమరావతికి పిలిపించుకున్నారు. అయితే వారి అనుచరుల ద్వారా ఆందోళనలు మాత్రం కొనసాగించమని సూచించినట్లు తెలిసింది. నిరసన సెగను తట్టుకోలేక ఆదిమూలమే స్వచ్ఛందంగా పోటీ నుంచి తప్పుకునేలా ఆందోళనలు కొనసాగించాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే జేడీ రాజశేఖర్‌ని రెబల్ అభ్యర్థిగా పోటీ చేయాలని చంద్రబాబే సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ మేరకే జేడీ రాజశేఖర్ ప్రెస్ మీట్ పెట్టి చంద్రబాబు మాకు దేవుడు.. ఆయన బొమ్మ పెట్టుకునే నామినేషన్ వేసి ప్రచారం చేస్తానని ప్రకటించడం విశేషం.